## కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎంపీటీసీ



ఇబ్రహీంపట్నంరూరల్, జూలై 13 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావును మాజీ ఎంపీటీసీ ఏనుగు భరత్‌రెడ్డి శనివారం నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల పదవి కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా భరత్‌రెడ్డిని కేటీఆర్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కప్పాడు, తుర్కగూడ గ్రామాల అభివృద్ధికి అతిచిన్న వయస్సులోనే కష్టపడి పని చేయడం ఎంతో అభినందనీయమన్నారు. భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుండాలని సూచించారు. కష్టపడేవారికి భవిష్యత్తులో తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు.

## దోమ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ




దోమ పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

దోమ, జూలై 13 : పిటీషన్‌దారుల సమస్యలకు వెంటనే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకొని వారికి న్యాయం చేసే దిశగా పని చేయాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. శనివారం దోమ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ సందర్శించి రికార్డులను పరిశీలించారు. స్టాఫ్ వివరాలు వారి పనితీరును అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక గ్రామాల్లో లా అండ్ ఆర్డర్ ఏ విధంగా ఉన్నదని ఎస్ఐ ఆనంద్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.అనంతరం క్రైమ్ పిటీషన్‌ల వివరాలను పరిశీలించారు.

## ఆర్టీసీ లాజిస్టిక్ ఏజెంట్లకు దరఖాస్తుల ఆహ్వానం

పరిగి, జూలై 13 ః ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని టీజీఆర్టీసీ లాజిస్టిక్ ఏజెంట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రంగారెడ్డి రీజియన్ ఏటీఎం రవీందర్ తెలిపారు. పట్టణ, మండల, గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ లేదా ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో రూ.5వేలు, మండల, గ్రామీణ ప్రాంతాల్లో వెయ్యి రూపాయలు చెల్లించి ఆర్టీసీ లాజిస్టిక్ ఏజెన్సీ తీసుకోవచ్చని పేర్కొన్నారు. పరిగి, కులకచర్ల, బొంరాస్‌పేట్, దేశాయిపేట, గుర్మిట్కల్, యాద్గిర్ ప్రాంతాల వారు వివరాలకు విశ్వనాథ్‌గౌడ్ ఫోన్ నెం.9154298738లో సంప్రదించాలని ఆయన సూచించారు.

## విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవాలి



నూతన ఆడిటోరియాన్ని ప్రారంభిస్తున్న ఓగా చైర్మన్ గోపాల్‌చారి, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు సత్తెందర్

పరిగి, జూలై 13 : విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించి తమ లక్ష్యాలను చేరుకోవాలని ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ సొసైటీ చైర్మన్, ఓగా కళాశాల చైర్మన్ టీవీ గోపాల్‌చారి, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వీ సత్తెందర్ పేర్కొన్నారు. శనివారం పరిగిలోని ఓగా బీఈడీ కళాశాలలో నూతనంగా నిర్మాణం చేపట్టిన ఆడిటోరియాన్ని వారు ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కళాశాలలోని వసతులను సద్వినియోగం చేసుకొని చక్కటి అధ్యాపకుల బోధనలతో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. బోధనోపకరణాలను సమయానుకూలంగా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. ఓగా కళాశాల పరిగిలో నెలకొల్పడం ఈ ప్రాంత విద్యార్థుల అదృష్టంగా అభివర్ణించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తప్పనిసరిగా నిత్యం కళాశాలకు రావడంతో పాటు అధ్యాపకులు బోధించే అంశాలను అర్థం చేసుకోవాలని అన్నారు. అనంతరం బంగారు పతకం సాధించిన విద్యార్థులను సన్మానించి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓగా కార్యదర్శి బీఎన్ రాజేశ్వర్, ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి హన్మంతరావు, ఎకనామిక్ ప్రధాన కార్యదర్శి జీ రంగారెడ్డి, కళాశాల కార్యదర్శి సీహెచ్ రవీంద్రనాథ్, కోశాధికారి గోపతిసాయిబాబా, అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.


## ట్రాన్స్‌జెండర్లకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి

ఖైరతాబాద్, జూలై 13 : ట్రాన్స్‌జెండర్లకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఫతేనగర్‌లో ఈ నెల 12న ఓ ట్రాన్స్‌జెండర్ దారుణ హత్యకు గురైందని, దీని వెనుక రౌడీషీటర్ల హస్తం ఉందని ఆరోపించారు. గతంలోనే సదరు రౌడీషీటర్లు ట్రాన్స్‌జెండర్లపై దాడులు చేయడంతో పాటు వారి డబ్బులు సైతం లాక్కున్నారని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య

# అర్హులకు అందని గృహజ్యోతి!



### అర్హత ఉన్నా.. ఎదురుచూపులు..

### పేర్ల నమోదులో తీవ్ర జాప్యం
### పూర్తిస్థాయిలో అమలు కాని పథకం

సిటీబ్యూరో, జూలై 13 (నమస్తే తెలంగాణ): గృహజ్యోతి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మార్చి నెలలోనే ప్రారంభించింది. ఎన్నికల్లో అతి ముఖ్యమైన హామీల్లో ఒకటైన 200 యూనిట్ల విద్యుత్ పథకం అమలు కొందరికే అన్నట్లు మారింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 7 నెలలు గడుస్తున్నా గృహజ్యోతి పథకం పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే వేలాది మంది ఎప్పుడెప్పుడా అని చూస్తున్న పరిస్థితి నెలకొన్నది. ప్రజా పాలన అంటూ ఎంతో ఆర్భాటంగా చేపట్టిన దరఖాస్తులు తీసుకున్న ప్రభుత్వం.. దాన్ని గందరగోళంగా మార్చేసింది. దరఖాస్తు వివరాలను నమోదు చేయడంలో ప్రభుత్వ యంత్రాంగం చేసిన తప్పుల కారణంగానే పెద్ద సంఖ్యలో అర్హులకు ఉచిత విద్యుత్ అందడం లేదు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాలు, శివార్లలో మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ కార్యాలయాల చుట్టూ అర్హులైన వారంతా తిరుగుతున్నా.. వారికి గృహజ్యోతి పథకాన్ని వర్తింపజేసి జీరో బిల్లులను ఇవ్వడం లేదు. కొందరు పేదలు 200 యూనిట్ల లోపు ఉన్న తమ బిల్లులను తీసుకొని విద్యుత్ శాఖ కార్యాలయాలు, అధికారులను సంప్రదిస్తున్నా..తమ పరిధిలో లేదంటూ అధికారులు చెబుతున్న పరిస్థితి. కొందరికీ మార్చి నెల నుంచే గృహజ్యోతి పథకం అమలవుతోందని, తమకు ఎందుకు చేయడం లేదని పేదలు కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్రంగా మండిపడుతున్నారు. ఈ పథకం పూర్తి స్థాయిలో అమలు కాకపోవడానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, అమలు చేయలేని హామీలు ఇచ్చి ప్రజలను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మోసం చేస్తోందంటూ కొందరు వాపోతున్నారు.

### 34 లక్షల మంది అర్హులు

గ్రేటర్ పరిధిలో మొత్తం సుమారు 48 లక్షల మంది గృహ విద్యుత్ వినియోగదారులు ఉండగా, అందులో సుమారు 34 లక్షల వరకు 200 లోపు యూనిట్ల విద్యుత్‌ను వాడుతున్నట్లు డిస్కంలో లెక్కలు ఉన్నాయి. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులు, తెల్లరేషన్ కార్డు నిబంధనతో విద్యుత్ శాఖ అధికారులు గత ఫిబ్రవరి నెలలో గృహజ్యోతి పథకం లబ్ధిదారులను గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఫిబ్రవరి చివరి నాటికి గ్రేటర్ పరిధిలోని 9 సర్కిళ్లలో మొత్తం 11 లక్షల మంది వినియోగదారులు మాత్రమే గృహజ్యోతి పథకం కింద అర్హులుగా గుర్తించి జీరో బిల్లులను మార్చి నెల 1వ తేదీ నుంచే జారీ చేశారు. కాగా, ప్రజా పాలన కార్యక్రమం దరఖాస్తు చేసుకోని, అద్దె ఇండ్లల్లో ఉన్న వారు లక్షల్లోనే ఉన్నారు. వారందరికీ గృహజ్యోతి పథకం అమలు చేయాల్సి ఉన్నా, ఇప్పటికీ ఆపని పూర్తి కావడం లేదు. మరోవైపు తెల్లరేషన్ కార్డు ఉంటేనే ఉచిత విద్యుత్‌కు అర్హులు అని ప్రభుత్వం పెట్టిన నిబంధనతో 20 లక్షల మంది ఆ పథకానికి దూరం కావాల్సి వస్తోంది. ఎన్నికల సమయంలో ఎలాంటి నిబంధనలు పెట్టకుండా, గెలిచి.. ప్రభుత్వం ఏర్పాటు చేసి అనంతరం తెల్ల రేషన్ కార్డు నిబంధన పెట్టడంపై విద్యుత్ వినియోగదారులు తీవ్రంగా మండిపడుతున్నారు.



### అర్హులందరికీ వెంటనే ఉచిత విద్యుత్ అందించాలి

**- ఎం.శ్రీనివాస్, సీపీఎం కార్యదర్శి, గ్రేటర్ హైదరాబాద్**

గ్రేటర్ హైదరాబాద్‌లో 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ కోసం గృహజ్యోతి పథకంలో దరఖాస్తు చేసుకున్న అనేక మంది అర్హులకు నేటికీ అమలు కావడం లేదు. దరఖాస్తు వివరాలను నమోదు చేయడంలో ప్రభుత్వ యంత్రాంగం చేసిన తప్పుల కారణంగానే పెద్ద సంఖ్యలో అర్హులకు ఉచిత విద్యుత్ అందడం లేదు. నగరంలో చాలా మురికివాడల్లో ఇటీవల సీపీఎం చేపట్టిన బస్తీబాట సందర్భంగా పేదలు తమకు ఉచిత విద్యుత్ రావడం లేదని, భారీగా కరెంటు బిల్లులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాపాలన సందర్భంగా చేసుకున్న దరఖాస్తులోని వివరాలను తక్కువ సమయంలో హడావుడిగా నమోదు చేయడం కారణంగానే తప్పుడు జరిగాయి. దీనివల్ల నిజమైన లబ్ధిదారులు చాలా నష్టపోతున్నారు. వేలాది మంది ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి నెలకొంది. తప్పులను సరిచేసి వెంటనే నిజమైన,అర్హులైన వారందరికీ ఉచిత విద్యుత్ పథకమైన గృహజ్యోతి అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

# 9 గంటలకుపైగా.. నిల్చొనే విధులు

### లేట్‌నైట్ డ్యూటీతో పరేషాన్
### ఉచిత బస్సు స్కీంతో పెరిగిన టికెటింగ్ ఇష్యూ భారం
### పెద్ద అవరోధంగా టాయిలెట్ సమస్య.. సరిపడా నీళ్లు తాగలేని దుస్థితి
### అనారోగ్యంతో బాధపడుతున్న మహిళా కండక్టర్లు
### సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

సిటీబ్యూరో, జులై 13 (నమస్తే తెలంగాణ) : 'సమస్య చెప్పుకోవడానికి కూడా భయపడాల్సి వస్తున్నది. పనిభారం పెరుగుతుందని మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే లేడు. ఒక్క రోజు లీవ్ అడగాలంటే అది ఎవరైన చనిపోయారనే వార్తనే అయ్యిండాలి. డబుల్ డ్యూటీలు చేస్తేనే నెలలో ఒక్క రోజు లీవ్ దొరుకుతుంది. డ్యూటీ దిగేసరికి రాత్రి 11 అవుతుంది. భయభయంగా ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి మాది.'' అంటూ మహిళా కండక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లేట్ నైట్ డ్యూటీలతో వాళ్లంతా పరేషాన్ అవుతున్నారు. 'గతంలో మార్నింగ్ డ్యూటీ చేసుకుని మధ్యాహ్నం ఇంటికి వెళ్లిపోయే వాళ్లం. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. రాత్రి 11 దాటుతోందని మిధాని డిపోకు చెందిన ఓ కండక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. బస్సుల సంఖ్య పెంచలేదు... కానీ ఉచిత బస్సు స్కీం పెట్టారు. ఒక్క బస్సులో 40-50 మంది ఎక్కడమే అధికం. అలాంటిది 150-200 మంది ఎక్కుతున్నారు. వారందరికీ టికెట్ ఇష్యూ చేయడం కత్తిమీద సాములాంటిది. ఈ క్రమంలో టికెట్ ఇష్యూలో తేడా వచ్చిందంటూ సస్పెన్షన్ విధిస్తున్నారు. ఇది మమ్మల్నీ మానసికంగా ఆందోళనకు గురి చేస్తున్నది.' అని రాణిగంజ్ డిపోకు చెందిన ఓ మహిళా కండక్టర్ అభిప్రాయపడ్డారు. 'బస్సులో ఏకధాటిగా 9 గంటలు నిలబడుతున్నాం. ఏ కొంత సమయం కూడా కూర్చొనే వీలు లేకుండా పోయింది. ఉచిత బస్సు స్కీంతో బస్సులన్నీ రద్దీగా మారుతున్నాయి. బస్సుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉంది. లేకపోతే ఉన్న సిబ్బందిపై పనిభారం అధికంగా పడి వారంతా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంద'ని కండక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. 'గతంలో కేసీఆర్ హయాంలో ఎర్లీ డ్యూటీ విధానం అమల్లో ఉండేది. ఇప్పుడు అది పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. మహిళా కండక్టర్లు రిటైర్ట్ అయిపోతే వారి స్థానంలో కొత్తగా మహిళా కండక్టర్లకే అవకాశం ఇవ్వాలి. అలా కాకుండా పురుషులను ఆ లిస్టులో చేరుస్తున్నారు.' అంటూ హయత్‌నగర్ కు చెందిన కండక్టర్ పేర్కొన్నారు. .



అనారోగ్య సమస్యలతో సతమతం..

ఏకధాటిగా నిలబడి ఉండటం వల్ల మహిళలకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. టాయిలెట్ల సమస్య కూడా వారికి పెద్ద అవరోధంగా మారింది. ఈ పరిస్థితుల్లో వారు సరిపడా నీళ్లు తీసుకోలేక అనారోగ్యపాలవుతున్నారు. అంతేకాదు మహిళలు డబుల్ డ్యూటీలు చేయాలంటూ.. ఒత్తిడి తీసుకొస్తున్నారు. టార్గెట్‌లు పెట్టి వారిని సతాయిస్తున్నారని మహిళా కండక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుమారు 3వేల మంది మహిళా కండక్టర్లు ఉన్నారు. గ్రేటర్‌లో సుమారు 16 వందల మంది ఉంటారు. సాధారణంగా వీరి విధులు సిటీలో అయితే 7 గంటలు, జిల్లాల్లో అయితే 8 గంటలు ఉండాలి. కానీ ప్రస్తుతం మరో మూడు గంటలు అదనంగా ఉండాల్సిన దుస్థితి వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో విధులు నిర్వర్తించడం కష్టంగా ఉందని ఉన్నతాధికారుల వద్ద మొరపెట్టుకున్నా ఫలితం లేదని చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



# అట్టహాసంగా.. స్నాతకోత్సవం

### పట్టాలు.. బంగారు పతకాలు అందుకున్న ట్రిపుల్ఐటీ విద్యార్థులు

శేరిలింగంపల్లి, జూలై 13: గచ్చిబౌలిలోని బ్రహ్మ కుమారీస్ శాంతి సరోవర్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో శనివారం ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ట్రిపుల్ ఐటీ) 23వ స్నాతకోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ స్నాతకోత్సవంలో మొత్తం 600 మంది గ్రాడ్యుయేట్లు పట్టాలు అందుకున్నారు. వారిలో 125 మంది బీటెక్, 156 మంది ఎంటెక్, 16 మంది ఎంఎస్ఐటీపీ, 32 మంది పీహెచ్‌డీ పట్టాలను అందుకున్నారు. ట్రిపుల్ ఐటీలో విశేష ప్రతిభ చూపిన 13 మందికి బంగారు పతకాలు అందజేశారు. ప్రతిష్టాత్మక ట్రిపుల్ ఐటీ గోల్డ్ మెడల్‌ను ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్(ఈసీఈ) బీటెక్ విద్యార్థి యర్రమనేని జైష్ణవ్ సొంతం చేసుకున్నారు. ఉత్తమ ఆల్‌రౌండర్ గోల్డ్‌మెడల్‌ను కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) బీటెక్ విద్యార్థి తాటిపాముల హర్షవర్ధన్ అందుకున్నారు. అంతకు ముందు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ కలైసెల్వీ విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ కలైసెల్వీ మాట్లాడుతూ ఒకప్పుడు కంప్యూటర్ సైన్స్ అనేది కీలకంగా ఉండేదని, ఇప్పుడు ఏఐ, ఎంఎల్‌లు ముఖ్యభూమిక పోషిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ట్రిపుల్ఐటీ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ అశోక్ జున్‌జున్‌వాలా, డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### సీఈవోగా సేవలందించాలని ఉన్నది



ప్రతిష్టాత్మక ట్రిపుల్ ఐటీ గోల్డ్ మెడల్ అవార్డును ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్(ఈసీఈ) బీటెక్ విద్యార్థి సాధించడం ఎంతో సంతోషంగా ఉన్నది. మా స్వస్థలం ఏపీ. మేము చాలాకాలంగా హైదరాబాద్ మూసాపేట్‌లో స్థిరపడ్డాం. నాన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, అమ్మ గృహిణి. ఈసీఈలో మాస్టర్స్ చేయాలనుకుంటున్నా. ఎప్పటికైనా ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో సీఈవోగా స్థిరపడాలన్నది నా లక్ష్యం.

**- యర్రమనేని జైష్ణవ్**

### రాజకీయాల్లో స్థిరపడాలన్నదే నా లక్ష్యం



ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్(ఈసీఈ) బీటెక్‌లో ట్రిపుల్ఐటీ ఆల్‌రౌండర్‌గా గోల్డ్ మెడల్ అవార్డును సొంతం చేసుకోవడం చాలా ఆనందంగా ఉన్నది. మా స్వస్థలం సిద్దిపేట, చేర్యాల పట్టణం. తల్లిదండ్రులు కృష్ణవేణి అంగన్‌వాడీ టీచర్, నాన్నా వెంకటేశ్‌గౌడ్ రాజకీయ నాయకుడు. నాకు ఎప్పటికైనా రాజకీయాల్లో స్థిరపడాలన్నది నా లక్ష్యం. ప్రస్తుతానికి క్యాంపస్ సెలక్షన్‌లో భాగంగా సంవత్సరానికి 50 లక్షల వేతనంతో మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ సంస్థలో నాకు ఉద్యోగం లభించింది. భవిష్యత్‌లో మంచి రాజకీయ నాయకుడిగా కావాలన్నదే నా లక్ష్యం.

**- తాటిపాముల హర్షవర్ధన్**

# అద్దె ఇప్పించండి మహాప్రభో!

### గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ భవన యజమాని మొర

- ఏడు నెలలుగా అద్దె చెల్లించని అధికారులు
- ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న యజమాని
- ఖాళీ చేయాలని కోరుతున్న వైనం

యాచారం, జూలై 13 : మండలంలోని మేడిపల్లి గ్రామంలో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. మండలంలో ఫార్మాసిటీ ఏర్పాటు చేయనుండడంతో ఆయా గ్రామాలకు రక్షణగా గత ఏడాది జూన్ 1న రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నూతన పోలీస్‌స్టేషన్‌ను అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. అదే గ్రామానికి చెందిన సిద్దగోని జగన్ అనే వ్యక్తి నూతన ఇంట్లో అప్పటి సీఐ లింగయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. సీఐ, ఇద్దరు ఎస్ఐలు, ఇద్దరు ఏఎస్ఐలు, ఇరవై మంది సిబ్బందితో పోలీస్‌స్టేషన్‌ను సంవత్సరం క్రితం ఏర్పాటు చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న యాచారం మండలంలోని మేడిపల్లి, నక్కర్త, నానక్‌నగర్, పిల్లిపల్లి, తాటిపర్తి, కుర్మిద్ద, మర్లకుంటతండా, మంగళిగడ్డతండా, గొల్లగూడతో పాటు కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట, ఆకులమైలారం, ముచ్చర్ల, సార్లరావులపల్లి, ఉట్లపల్లి, సాయిరెడ్డిగూడ, పంజగూడ, మాలగూడ, సార్లరావులపల్లితండా, బండమీదితండా, పోచమ్మతండా, గుట్టలతండా, పోతుగడ్డతండా, కడ్తాల మండలం పల్లెచెల్కతండాలకు సేవలను అందిస్తున్నది. అయితే పోలీస్ స్టేషన్ భవనానికి టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో మొదట్లో ఆరు నెలలు అద్దె బాగానే చెల్లించినప్పటికీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అద్దె ఇవ్వడంలో టీజీఐఐసీ అధికారులు జాప్యం చూపిస్తున్నారు. మొదట్లో ఆరు నెలల పాటు అప్పటి సీఐ రామాంజనేయులు సహకారంతో ప్రతి నెలా రూ.10,000లు టీఎస్ఐఐసీ సహకారంతో అద్దె చెల్లించారు. ఒప్పందం ప్రకారం ఆరు నెలల వరకు రూ.10,000లు తరువాత రూ.18,000లు పెంచుతామని చెప్పిన అధికారులు రూ.18,000లు కాదుకదా ప్రతి నెలా ఇచ్చే రూ.10,000లు కూడా గత ఏడు నెలలుగా ఇవ్వడం లేదని ఇంటి యజమాని వాపోతున్నాడు. ఏడు నెలలుగా పోలీస్‌స్టేషన్ భవనానికి అద్దె చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి నెలకొన్నదని జగన్ వాపోతున్నాడు. భవనం అద్దె చెల్లించమని ఎవరిని అడిగినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. డబ్బులు ఇవ్వడంలో టీజీఐఐసీ అధికారులు లేదా ప్రభుత్వ అధికారుల వద్ద ఎక్కడ జాప్యం జరుగుతున్నదో తెలియడంలేదని వాపోతున్నాడు. ఏది ఏమైనప్పటికీ ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న అద్దె డబ్బులు చెల్లించడంతో పాటుగా, ప్రతి నెలా రూ.18,000లు సక్రమంగా చెల్లిస్తేనే పోలీస్‌స్టేషన్ నిర్వహించాలని లేదంటే ఖాళీ చేయాలని ఇంటి యజమాని సిద్దగోని జగన్ కోరుతున్నాడు. తనకు ఇవ్వాల్సిన రూ.1,26,000ల అద్దె డబ్బులను ఇచ్చి ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన కోరారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ నరసింహారావును వివరణ కోరగా టీజీఐఐసీ అధికారుల నుంచి అద్దె రావాలని, అధికారులను పోలీస్‌స్టేషన్ భవనానికి అద్దె అడుగుతున్నామని చెప్పారు. పోలీస్ స్టేషన్ భవనానికి త్వరలోనే ఏడు నెలల అద్దె ఇప్పించడానికి కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు.




యాచారం మండలం మేడిపల్లిలో అద్దె భవనంలో ఏర్పాటు చేసిన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటి పోలీస్‌స్టేషన్